పందేలపై ఫ్లెక్సీలు మారాయి..!

స్థల యజమాని పేరిట హెచ్చరికలు

ప్రజాశక్తి - పోడూరు

పోలీసులు స్టయిల్ మార్చారు.. గతంలో కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని పోలీసు శాఖ ఆధ్వర్యాన బరులు నిర్వహించే ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈసారి దానికి భిన్నంగా ఆయా స్థలాల యజమానుల పేరిట కోడిపందేలు నిర్వహిస్తే పోలీసుల చర్యలకు బాధ్యులవుతారు అంటూ మండలంలో కొన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీలు వెలిశాయి. యజమానులు కాదంటే ఆ స్థలాల్లో బరులు నిర్వహిస్తారా.. లేక పోలీసులే నేరుగా తమ శాఖ తరపున కాకుండా యజమానుల పేరిట ఫ్లెక్సీలు పెట్టించారా అనే చర్చ సర్వత్రా సాగుతోంది.

కోడిపందేలు నిర్వహించొద్దంటూ పెట్టిన యజమాని పెట్టిన బ్యానర్

రవాణా ఛార్జీలు .. వచ్చేనా..!

- ధాన్యం కిరాయి సొమ్ము కోసం లారీ, ట్రాక్టర్ యజమానుల ఎదురుచూపు
- ఒక్క ఏలూరు జిల్లాలోనే రూ.పది కోట్ల వరకూ బకాయి
- 21 రోజుల్లో చెల్లింపు నిబంధనకు పూర్తిగా తూట్లు
- లబోదిబోమంటున్న వాహన యజమానులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం నూతన కొనుగోలు విధానంలో అటు రైతులతోపాటు ఇటు ధాన్యం రవాణా చేసిన లారీ, ట్రాక్టర్ యజమానులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం తరలించిన వాహన యజమానులు రవాణా ఛార్జీల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధాన్యం తరలించిన 21 రోజుల్లో ధాన్యం రవాణా సొమ్ము జమ చేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ రైతుభరోసా కేంద్రాల ద్వారా 3.12 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. నూతన కొనుగోలు విధానంలో ధాన్యం తరలింపు రవాణా ఛార్జీలను ప్రభుత్వమే వాహనదారులకు చెల్లించాలి. రైతులే సొంతంగా వాహనాలు ఏర్పాటు చేసుకుంటే రైతుల ఖాతాల్లో రవాణా ఛార్జీలు జమ చేయనున్నట్లు ప్రభుత్వం చెప్పింది. రవాణా ఛార్జీలకు సంబంధించి ప్రభుత్వం పక్కాగా నిబంధనలు సైతం విధించింది. ఎనిమిది కిలోమీటర్లలోపు దూరానికి రవాణా ఛార్జీ కింద రూ.324, ఎనిమిది నుంచి 20 కిలోమీటర్ల దూరం రవాణా చేస్తే కిలోమీటర్‌కు టన్నుకు రూ.ఏడు, 20 నుంచి 40 కిలోమీటర్ల దూరం ఉంటే కిలోమీటర్‌కు టన్నుకు రూ.6.50, 40 నుంచి 80 కిలోమీటర్ల దూరం ఉంటే కిలోమీటర్‌కు టన్నుకు రూ.ఆరు, 80 కిలోమీటర్లపైన దూరం ఉంటే కిలోమీటర్‌కు టన్నుకు రూ.5.50 చొప్పున ప్రభుత్వం రవాణా ఛార్జీలు నిర్ణయించింది. ధాన్యం రవాణాకు లారీలతోపాటు ట్రాక్టర్లను అధికారులు ఉపయోగించారు. ధాన్యం తరలించిన తర్వాత రైతుభరోసా కేంద్రంలో మిల్లులో జనరేట్ చేసిన ధాన్యం రవాణాపత్రం, సొసైటీ స్టాంప్, ఆర్‌బికె స్టాంప్, ట్రక్ డ్రైవర్ సంతకం, ట్రక్ కాపీ, లేదా ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ పత్రం వంటివి జత చేసి సివిల్‌సప్లయిస్ జిల్లా మేనేజర్ కార్యాలయంలో వాహన యజమానులు దరఖాస్తు చేసుకోవాలి. ధాన్యం తరలించిన 21 రోజుల్లో రవాణా ఛార్జీలు కిరాయి వాహనాలైతే యజమానుల ఖాతాల్లో, సొంతంగా రైతులే వాహనాలు పెట్టుకుని తరలిస్తే రైతుల ఖాతాల్లో రవాణా ఛార్జీలు జమ చేయాల్సి ఉంది. ధాన్యం కొనుగోలు మొదలై నెలా పదిహేను రోజులు దాటిపోయింది. ఇప్పటి రవాణా ఛార్జీలు జమ కాలేదని లారీ, ట్రాక్టర్ల యజమానులు లబోదిబోమంటున్నారు.

రూ.పది కోట్లకుపైగా రవాణా ఛార్జీలు బకాయి

ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ తరలించిన ధాన్యానికి రవాణా ఛార్జీల నిమిత్తం రూ.పది కోట్లకు పైగా బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ రూ.కోటిన్నర వరకూ మాత్రమే జమైనట్లు తెలుస్తోంది. అదీ రైతులు సొంతంగా తరలించుకున్న వారికే జమైనట్లు సమాచారం. వాహనాదారులకు మాత్రం ఇంకా జమ కాలేదని తెలుస్తోంది. రవాణా ఛార్జీలు త్వరితగతిన జమ చేయాలని వాహనాల యజమానులు కోరుతున్నారు.

రబీ ధాన్యం తరలింపుపై ప్రభావం

మిల్లులకు ధాన్యం తరలించిన వాహనాలకు ఇవ్వాల్సిన రవాణా ఛార్జీలు సకాలంలో జమ చేయకపోవడం వల్ల రబీ ధాన్యం కొనుగోలులో తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి కన్పిస్తోంది. రవాణా ఛార్జీలు ఆలస్యమైతే రబీలో లారీ, ట్రాక్టర్ యజమానులు ధాన్యం తరలింపునకు తమ వాహనాలు పెట్టేందుకు ముందుకు రాని పరిస్థితి ఏర్పడనుంది. అదే జరిగితే రబీ ధాన్యం రవాణాలో తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థితి రానుంది. ఖరీఫ్‌లో ధాన్యం రవాణాలో లారీలు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రబీలోనూ ఇదే పరిస్థితి కొనసాగితే రైతుల ఇబ్బందులు మరింత తీవ్రతరమయ్యే ప్రమాదం ఉంది. వెంటనే లారీ, ట్రాక్టర్ యజమానులకు ఇవ్వాల్సిన ధాన్యం కిరాయి సొమ్మును ప్రభుత్వం వెంటనే జమ చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

భీమవరం : జిఒ ప్రతులను దహనం చేస్తున్న సిఐటియు నేతలు

చీకటి జిఒ నెం.1ని రద్దు చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన నిరసనల వెల్లువ

ప్రజాశక్తి - భీమవరం

రోడ్లు, ప్రధాన కూడళ్లలో సభలను, ర్యాలీలను నిషేధిస్తూ తీసుకొచ్చిన జిఒ నెం.1ని రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం స్థానికంగా జిఒ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడో ఏదో జరిగిందని సాకుగా చూపుతూ ప్రజల గొంతు నొక్కాలని ఈ చీకటి జిఒను తీసుకొచ్చిందని విమర్శించారు. ప్రజలు తమ సమస్యలపై గళం విప్పేందుకు, నినదించేందుకు, నిరసన తెలిపేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించేలా చీకటి జిఒలను తీసుకురావడం అన్యాయమన్నారు. తక్షణమే దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు శిరీష్‌కుమార్, ఎం.ఆంజనేయులు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, కిరణ్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

తణుకు రూరల్ :జిఒ ప్రతులను దహనం చేస్తున్న నేతలు

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెం.1ని రద్దు చేయాలని స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, నేత బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల గొంతు నొక్కే, పౌరుల ప్రాథమిక హక్కు హరించే ఈ జిఒను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెనగంటి దుర్గ, తెర్లి రాజేష్, బొడ్డపాటి శివ, కొత్తల పండు, గోవాడ రమేష్, సుధా వెంకటేశ్వరరావు, ఆర్.మహంకాళి శివరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉండి: జిఒ నెం.1ని తక్షణం రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మెయిన్ సెంటర్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కొట్టాడ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిఒ ప్రతులను చించి నిరసన తెలిపారు. అనంతరం సిఐటియు జెండాను మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి నాగేశ్వరరావు, కడలి నాగేశ్వరరావు, చిట్టి అన్నవరం, మోపిదేవి రాము, ఏలూరి వెంకన్నబాబు పాల్గొన్నారు.

తణుకురూరల్: రాష్ట్ర ప్రభుత్వం రోడ్లు, ప్రధాన కూడళ్లలో ర్యాలీలు, సభలు, సమావేశాలు నిషేధిస్తూ ఇచ్చిన జిఒ నెం.1ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వాన్‌బరి పరిశ్రమ వద్ద నిరసన తెలిపి జిఒ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ప్రజల్లోని అసంతృప్తిని అణచివేయడానికి వైసిపి ఈ జిఒ తెచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గుబ్బల గోపి, కె.శ్రీనివాసు, నారాయణ, ఎంవి.రాజు పాల్గొన్నారు.

భీమవరంరూరల్: అప్రజాస్వామికంగా తీసుకొచ్చిన జిఒ నెం.1ని రద్దు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వెంప గ్రామంలో మంగళవారం జిఒ కాపీలను చించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బల్ల చిట్టి, మేరి, కోటి బూసి, తాడి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో జిఒ 1 ప్రతుల దహనం

అఖిలపక్షం రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపు

ప్రజాశక్తి - వీరవాసరం

రాష్ట్ర ప్రభు త్వం నిరంకుశంగా తీసుకొచ్చిన జిఒ నెం.1 ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేయడం ద్వారా ప్రజలంతా నిరసన తెలపాలని అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వంపై వస్తున్న ప్రజా వ్యతిరేకతను, ఆ ఉద్యమాలను అణచి వేసేందుకే జిఒ నెం.1ని అమలులోకి తీసుకొచ్చారని సమావేశం ఆరోపించింది. వివిధ పార్టీలకు చెందిన నాయకులతో అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశాన్ని మంగళవారం స్థానిక జనసేన కార్యాలయంలో గుండా రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. జిఒ నెం.1ని వ్యతిరేకిస్తూ త్వరలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఉద్యమించాలని, భోగి మంటల్లో జిఒ నెం.1 ప్రతులను వేసి నిరసన వ్యక్తం చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు రెడ్డి రామారావు, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, బిజెపి నాయకులు కోడి నరసింహరావు, కొల్లి వెంకట్రావు, ఎస్.నరేష్, జనసేన నాయకులు గుండా బాబు, యర్రంశెట్టి శీనయ్య, టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నినదించిన అంగన్వాడీలు

సమస్యలు పరిష్కరించాలని

తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు

పెనుమంట్ర : ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - ఉండి

కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ నేతలు డి.సత్యవేణి, సిహెచ్.చైతన్య మాట్లాడుతూ తమకు ప్రభుత్వ ఉద్యోగం పేరుతో సంక్షేమ పథకాలను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ప్రమోషన్లలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరస్వామినాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ధనికొండ శ్రీనివాస్, కొట్టాడ వెంకటేశ్వరరావు, చిట్టి అన్నవరం, అంగన్వాడీలు పాల్గొన్నారు.

వీరవాసరం: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటి తహశీల్దార్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి నాగరత్నం మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీలు వరలక్ష్మి, సత్యవతి, మంగ, శాంతకుమారి, తులసి, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ దండు అశోక్ వర్మకు అందజేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు ఎం.సాయిమహాలక్ష్మి, ఎం.శాంతకుమారి, టి.చిన్నమ్మ, వి.శాంతి, టిఎల్‌టి.భవాని, వి.సరస్వతి, వి.భాగ్యలక్ష్మి, ఎం.సుధారాణి, ఎన్.అరుణ, డి.మౌనిక, కె.కరుణశీలతోపాటు సంఘీభావంగా కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆచంట: అంగన్వాడీల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు వైట్ల ఉషారాణి, వద్దిపర్తి అంజిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించి ఆర్‌ఐకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు గుత్తుల శ్రీదేవి, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి జి.పెద్దింట్లు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన ఆందోళననుద్దేశించి ఆమె మాట్లాడారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ జి.అనితకుమారికి అందించారు.

కార్యక్రమంలో అంగన్వాడీలు ఎ.సీతారత్నం, శేషకుమారి, పి.లక్ష్మికుమారి, పి.రాజ్యలక్ష్మి, కె.కామాక్షితోపాటు సంఘీభావంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యడ్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

తణుకురూరల్: అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెం.1ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా నేత అడ్డగర్ల అజయకుమారి, ఐలు జిల్లా నేత కామన మునిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్‌వాడీ వర్కర్స్, ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో స్థానిక తహశీల్ధారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పేదల సంక్షేమ సంఘం అధ్యక్షులు గార రంగారావు, కె.నాగరత్నం, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆకివీడు: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫేస్ ఐడెంటిఫికేషన్ హాజరు విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ అంగన్వాడీలు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిటి రాజకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండలాధ్యక్షులు పెంకి అప్పారావు మాట్లాడగా యూనియన్ నాయకులు ఇరానీ దేవి, పైడేశ్వరి, సీతా మహాలక్ష్మి, విశాలాక్షి, రమాకుమారి, అమ్మాజీ శైలజ పాల్గొన్నారు.

ఆకివీడులో..

టైమ్ స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలి

మార్టేరు వరి పరిశోధనా కేంద్రం కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు వరిపరిశోధనా కేంద్రంలో 25 సంవత్సరాలుగా కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని టైమ్ స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని మార్టేరు వరి పరిశోధన స్థానం వద్ద మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. కార్మికులు భోజన విరామ సమయంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కూసంపూడి సుబ్బరాజు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి పనిచేస్తున్నా కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ధరల పెరుగుదలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రమూ పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. ఈనెల 22న చలో గుంటూరు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, కార్మిక నాయకురాలు ఎస్.నూకరత్నం, రమణ, కార్మికులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న కార్మికులు

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జెసి మురళీ

సచివాలయాల్లో జెసి తనిఖీలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని దిగమర్రు, కొత్తపేట, ఆగర్రు, బల్లిపాడు సచివాలయాలను జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి మురళి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు. సచివాలయాలకు ప్రజలు పెట్టుకున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే వారికి లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. ఉద్యోగులందరూ సమయపాలన పాటించి విధులకు సకాలంలో హాజరై ప్రజల మన్ననలు పొందాలన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. దిగమర్రు గ్రామంలో జాతీయ రహదారులకు సంబంధించి ప్రభుత్వ భూములను అధికారులతో కలిసి పరిశీలించారు. జెసి వెంట తహశీల్దార్ జి.మమ్మీ, ఎంపిడిఒ సంఘాని వెంకటేశ్వరరావు, వ్యవసాయ అధికారి అబ్దుల్ రహీం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాసిరాజు

ఇళ్ల స్థలాలపై ప్రాథమిక విచారణ

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు - వెంకటాపురంలో ఇళ్ల స్థలాలపై భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు మంగళవారం విచారణ చేపట్టారు. కాళ్లకూరు - వెంకటాపురం ప్రాంతానికి చెందిన 15 మంది పేదలు ఇళ్ల స్థలాలివ్వాలని జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డిఒ దాసిరాజు ప్రాథమిక విచారణ నిర్వహించారు. ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడారు. అనంతరం పెదఅమిరం, బొండాడ, సీసలి గ్రామాల్లో వ్యవసాయ భూములు వ్యవసాయేతర భూములుగా మార్చడానికి దరఖాస్తు చేసుకున్న స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, ఆర్‌ఐ కలిదిండి రాఘవరాజు, విఆర్‌ఒలు నిట్టల సీతారాం, చిట్టిబాబు, రాధాకృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

ఎస్‌కెఎస్‌డి విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - తణుకురూరల్

ఈ నెల 7వ నుండి 9వ తేదీ వరకూ అనకాపల్లి ఎఎంఎఎల్ కళాశాలలో జరిగిన బాస్కెట్ బాల్ పోటీల్లో తణుకు ఎస్‌కెఎస్‌డి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని డి.సౌజన్య జిల్లా టీమ్ తరుపున రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ బిహెచ్ హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి సౌజన్యను అభినందిస్తూ జ్ఞాపికను అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావును కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు అభినందించారు. ట్రెజరర్ నందిగం సుధాకర్, పరిపాలనాధికారి డి.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ పి.నరేంద్రబాబు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సౌజన్యను అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని వార్డు ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ ఎ.అనిత తెలిపారు. స్థానిక జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలన్నారు. వాహనాలు నడిపినప్పుడు ఫోన్ ఉపయోగించరాదన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పుట్‌పాత్‌పై నడవాలని ఉదహరిస్తూ విద్యార్థులకు డెమో ద్వారా వివరించారు. అనంతరం రహదారి భద్రత వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేసి మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ నిమ్మల

లంకలకోడేరులో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాసన సభ్యులు నిమ్మల రామానాయుడు మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి అంటే కోడిపందేలు, జూదం కాకుండా సంక్రాంతి అంటే ముగ్గులు, హరిదాసు కీర్తనలు తెలుగింటి వంటలు కుటుంబసభ్యుల మధ్య ఆప్యాయత అనురాగాలతో గడపాలనే ఉద్దేశంతో ఈ సంక్రాంతి రంగుల హరివిల్లులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పోటీల్లో మొదటి బహుమతిని దగ్గులూరుకు చెందిన తమ్మ దుర్గభవాని, ద్వితీయ బహుమతి గవరపేటకు చెందిన దాడి భీమేశ్వరి దుర్గ, తృతీయ బహుమతి లంకలకోడేరుకు చెందిన కూడక అన్నపూర్ణ గెలుచుకున్నారు. వారికి ఎంఎల్‌ఎ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ కోడి భాస్కర్, సెక్రటరీ పాముల రజనీకుమార్, కలిదిండి రామచంద్రరాజు పాల్గొన్నారు.

ఘనంగా రూత్ కళ పుట్టినరోజు

ప్రజశక్తి - ఉండి

తెలుగు మహిళా ఉండి నియోజకవర్గ అధ్యక్షురాలు, ఎన్‌ఆర్‌పి అగ్రహారం మాజీ సర్పంచి కన్నెగంటి రూత్ కళ పుట్టినరోజు వేడుకలు ఆమె నివాసంలో తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఎ రామరాజు పాల్గొని మాట్లాడారు. రూత్ కళ పార్టీలో క్రియాశీలక సభ్యురాలుగా పనిచేస్తూ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేయించి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాగిత మహంకాళి, చెన్నంశెట్టి హరినాయుడు, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆగర్తిపాలెంలో ఫ్యామిలీ ఫిజిషియన్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఆగర్తిపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం హెల్త్ అండ్ హెల్త్ సెంటర్లో డాక్టర్ నవ్య జీవన్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రోగులకు షుగర్, బిపి, డెంగీ, మలేరియా తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె.ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పి.దేవి, ఎఎన్‌ఎం లక్ష్మీకాంతం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గంగాభవాని

మోగల్లు పాఠశాలలో రాష్ట్ర పరిశీలకులు

ప్రజాశక్తి - పాలకోడేరు

మోగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల రాష్ట్ర పరిశీలకులు ఆర్‌ఎస్ గంగాభవాని మంగళవారం పరిశీలించారు. ప్రధాన మంత్రి స్కూల్ రైజింగ్ ఇండియా పాఠశాలల ఎంపికలో భాగంగా మోగల్లు ఉన్నత పాఠశాలను గంగా భవాని సందర్శించి వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక వనరుల ద్వారా పాఠశాలను మరింతగా అభివృద్ధి చేయొచ్చని సూచించారు. ఆమె వెంట సమగ్ర శిక్ష ఎఎంఒ శ్రీమన్నారాయణ, ఎఒ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొడమంచిలిలో కుళాయి కనెక్షన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలి, టి.మెరకలో ఇంటింటికీ కుళాయి కనక్షన్లను ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పర్యటించినప్పుడు అయన ఇచ్చిన హామీ మేరకు కొడమంచి టి.మెరకలో ఇంటింటికీ కుళాయి కనక్షన్ ఇచ్చే ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కుసుమే నారాయణ మూర్తి, వైసిపి నాయకులు యల్లమెల్లి రాజేష్, బొరుసు రాంబాబు, జంగా పండు పాల్గొన్నారు.

కాళీపట్నంలో భూసర్వే

ప్రజాశక్తి - మొగల్తూరు

కాళీపట్నంలో మంగళవారం రెవెన్యూ అధికారులు భూ సర్వే నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన భూ సర్వేలో భాగంగా సర్వే చేపట్టామని తహశీల్దార్ జి.అనితకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ధనుంజయ, సచివాలయ సిబ్బంది, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

264 కోడికత్తులు స్వాధీనం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువ కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సిహెచ్.నాగప్రసాద్ సోమవారం రాత్రి తెలిపారు. భీమవరం సబ్ డివిజన్ డిఎస్‌పి బి.శ్రీనాథ్ ఆధ్వర్యంలో తోలేరు గ్రామంలోని ముత్యాలపల్లి సుబ్రహ్మణం ఇంటిపై దాడిచేసి ఇంట్లో ఉన్న 264 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సుబ్రహ్మణ్యం తాపి పని చేసుకుంటూ గత కొన్ని సంవత్సరాలుగా కోడి కత్తులు కడుతుంటాడని తెలిపారు. వచ్చిన సమాచారంతో ఇంటిని సోదా చేసి కోడి కత్తులను గుర్తించామని తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో వీరవాసరం ఎస్‌ఐ రమేష్‌తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

40 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పడమటి పాలెంలోని ఉచిత కాలవ వద్ద నాటు సారా స్థావరంపై మంగళవారం దాడి చేశామని ఎస్‌ఐ ఎం.వీరబాబు తెలిపారు. ఈ దాడిలో 40 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలి

జిల్లాలో జెండాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకూ బెంగళూరులో నిర్వహించనున్న సిఐటియు అఖిలభారత 17వ మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షులు జి.శిరీష్‌కుమార్ సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ అఖిల భారత 17వ మహాసభలు బెంగళూరులో జరగనున్నాయని తెలిపారు. దేశంలో ఉద్యోగులు, కార్మికులు సాధారణ ప్రజానీకం వారి వేతనాల స్థితిగతులపై చర్చ జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను తొలగిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, అప్పారావు, కిరణ్, భాస్కర్ రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

తణుకురూరల్: మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ విజ్ఞప్తిచేశారు. మంగళవారం ఇరగవరం మండలం ఇల్లిందరపర్రులో వాన్‌బరి పరిశ్రమ వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ సిఐటియు ఆల్ ఇండియా 17వ మహాసభలు ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకూ బెంగుళూరులో జరగనున్న నేపథ్యంలో జెండా ఆవిష్కరణలు చేస్తున్నట్లు తెలిపారు. మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులు హరిస్తూ కార్పొరేట్ల జపం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికి ఇప్పటికీ ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయని దుర్మార్గుడు మోడీ అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు యూనియన్ నాయకులు గుబ్బల గోపి, కె.దుర్గాప్రసాద్, కేతా శ్రీనివాస్, ఎం.గోవిందరాజు, ఎన్.శివనారాయణ, శ్రీను పవన్ పాల్గొన్నారు.

12 నుంచి వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీలు

ముస్తాబవుతున్న బిఆర్‌ఎంవి స్కూల్ మైదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో ఈ నెల 12, 13, 14వ తేదీల్లో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎంఎల్‌ఎ వాలీబాల్ ఛాంపియన్షిప్ పోటీల కోసం బిఆర్‌ఎంవి మున్సిపల్ హైస్కూల్ మైదానాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వం నాడు-నేడులో భాగంగా పాఠశాల మైదానాన్ని సుందరంగా చేయనప్పటికీ ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు దగ్గరుండి రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు మరింత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 12న జిల్లా కలెక్టర్ ప్రశాంతి వాలీబాల్ పోటీలను ప్రారంభించనున్నారు. 14వ తేదీన సంక్రాంతి సంబరాలతోపాటు ముగ్గుల పోటీలు, వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తారు.

స్కూల్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

సొసైటీ ఛైర్మన్ పదవి అదృష్టంగా భావిస్తున్నా

కాళ్లకూరు సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సురేష్

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు సహకార సంఘం ఛైర్మన్ పదవి రావడం అదృష్టంగా భావిస్తున్నానని సొసైటీ ఛైర్మన్ మాధు సురేష్ తెలిపారు. సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా మాధు సురేష్ పదవీ బాధ్యతలు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారిని గుర్తించి పివిఎల్ నరసింహరాజు ఈ అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి యిబ్బా శ్రీనివాస్, వైసిపి నాయకులు వేగేశ్న విజయరామరాజు, వైసిపి గ్రామ అధ్యక్షులు బొర్రా సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వేగేశ్న రవితేజ, ఆరేపల్లి కృష్ణారావు, తానుకొండ వెంకట్రావు, బి.ఎజ్రా, నంబూరి సత్యనారాయణరాజు, చిటికెన లక్ష్మణరావు, దావులూరి సామేలు, కె.పెద్దిరాజు పాల్గొని సురేష్‌కు పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు.

కాళ్లకూరు సొసైటీ ఛైర్మన్ సురేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైసిపి నాయకులు

చిరు వ్యాపారులకు ప్రభుత్వం అండ : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చిరు వ్యాపారులకు తమ ప్రభుత్వం అండగా ఉందని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్‌ఎన్ వేణుగోపాల్‌తో మాట్లాడారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ జగనన్న తోడు కార్యక్రమంలో భాగంగా బుధవారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిరు వ్యాపారుల ఖాతాల్లో వడ్డీ డబ్బులు జమ చేయనున్నారని పేర్కొన్నారు. భీమవరం నియోజవర్గంలో 5 వేల మంది చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించగా, వారు బ్యాంకులకు చెల్లించిన వడ్డీని నేడు తమ ప్రభుత్వం చిరు వ్యాపారుల బ్యాంకు ఖాతాల్లోకి జమచేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం వల్ల భీమవరం నియోజకవర్గంలో చిరు వ్యాపారులకు రూ.12 లక్షల మేరకు లబ్ధి జరుగుతుందన్నారు. సమాజంలో అన్ని వర్గాల అభివృద్ధికే తమ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్.గోగురాజు, కె.రాంబాబు, మహేష్ పాల్గొన్నారు.



డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్‌తో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ గ్రంధి

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు డిఎన్‌ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2 రోజులపాటు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మొదటి రోజు రంగోలి, మెహంది పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన అడబాల వాణిశ్రీ, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు నాగలక్ష్మి, బ్యూటీషియన్ వారిజ లిల్లీ సమకూర్చిన బహుమతులను విజేతలకు అందజేశారు. యూత్ హాస్టల్ జాతీయ ఉపాధ్యక్షులు కారుమూరి సూర్యనారాయణ బహుమతులు అందజేశారు. మంగళవారం జరిగిన కామర్స్ కార్నివల్‌లో సాంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శోభారాణి, నాగలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ పాల్గొన్నారు.

తణుకురూరల్ : రూట్స్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

తణుకురూరల్ : రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్‌లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించిటన్లు ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠి తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ బి.విద్యాకాంత్ మాట్లాడుతూ కనుమరుగవుతున్న సంస్కృతీ, సంప్రదాయాలను, పండుగ శోభను నేటి తరానికి తెలియజేయడం కోసం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించామని తెలిపారు. చిన్నారులు వివిధ రాష్ట్రాల సాంప్రదాయ వస్త్రాలను ధరించి ముగ్గులను గొబ్బెమ్మలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినిల కోలాటాన్ని, గంగిరెద్దు ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఎన్.సుధాకరవర్మ, ప్రయిమరీ ప్రిన్సిపల్ టి.సంధ్య, డి.పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ట్యాబ్ బహూకరణ

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో ప్రథమ స్థానం సాధించిన తోట బ్రాహ్మణి నాగ దుర్గకు బైర్రాజు సంస్థ అధినేత బైర్రాజు సత్యనారాయణ రాజు సతీమణి అప్పలనరసమ్మ జ్ఞాపకార్థం ట్యాబ్ అందజేశారు. స్థానిక పాఠశాలలో మంగళవారం సంస్థ కో ఆర్డినేటర్ తంగెళ్ల పద్మారావు, గ్రామ వికాస సమితి కన్వీనర్ గాదిరాజు సత్య నారాయణ రాజు చేతులమీదుగా ట్యాబ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్‌బాబు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఉండి : మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రామరాజు

జగన్‌వి బూటకపు వాగ్దానాలు

ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఉండి

ఒక్క ఛాన్స్ ఇవ్వండి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని బూటకపు వాగ్దానాలిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పులఊబిలోకి నెట్టేశారని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు విమర్శించారు. మంగళవారం ఉండి శివాలయం వీధిలో పార్టీ గ్రామ అధ్యక్షులు కాగిత వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంతెన రామరాజు పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అప్పుల ఊబిలోకి నెట్టేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మంతెన సాయి లచ్చిరాజు, కట్ట రాంబాబు, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, చెన్నంశెట్టి హరి నాయుడు, కిన్నెర వెంకన్న, మజ్జి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం ప్రజల అభిప్రాయాలను సేకరించారు.

మొగల్తూరు : వైసిపి పాలనలో ధరలు ఆకాశాన్నంటి సామాన్యుడి జీవనం దుర్భరంగా మారిందని టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు విమర్శించారు. మంగళవారం మొగల్తూరు పంచాయతీ పరిధి పాలకమ్మ చెరువులో రాష్ట్రానికి ఇదేమి ఖర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కత్తిమడ ముత్యాలరావు, కలిదిండి కుమార్‌బాబు, బస్వాని ఏడుకొండలుపాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సచివాలయ సిబ్బంది

జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి - పాలకోడేరు

సంక్రాంతి పండుగ నేపథ్యంలో జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భీమవరం రూరల్ సిఐ సిహెచ్ నాగప్రసాద్ హెచ్చరించారు. రెవెన్యూ, పోలీస్ శాఖ, సచివాలయాల ఆధ్వర్యంలో గొల్లలకోడేరు, కుమ్మదవల్లి, వేంద్ర గ్రామాల్లో మంగళవారం కోడి పందేలు, జూద క్రీడలు నిషేధంపై ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సిఐ నాగప్రసాద్ మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా కోడిపందేలు ఆడినా, నిర్వహించినా సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కోడిపందేలు బరులను పరిశీలించారు. అక్కడ నిషేధాజ్ఞలతో కూడిన బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఎస్ఐ రామచంద్రరావు, ఆర్‌ఐ నాగభూషణరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగ ముసుగులో కోడి పందేలు, జూద క్రీడలతో పాటు మద్యం అమ్మకాల నివారణకు అన్ని చర్యలూ తీసుకున్నామని తహశీల్దార్ షేక్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి, భీమవరం డివిజన్ రెవెన్యూ అధికారి దాసి రాజు ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే పందేల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

పాలకొల్లులో అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు కెనాల్ రోడ్డులోని వెంకటేశ్వరస్వామి, దాసాంజనేయస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ముగింపు సందర్భంగా మంగళవారం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. అన్న సమారాధనలో దాతలు చోడిశెట్టి వీర మోహన్‌రావు, యడ్ల నాగేశ్వరరావు, పడాల అప్పారావు, కొప్పు కిరణ్ కుమార్, పాటపల్ల వర ప్రసాద్, మాఘం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మావుళ్లమ్మ అమ్మవారి మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఉత్సవ కమిటీకి సూచించారు. ఈ ఉత్సవాలకు ఎంఎల్‌ఎ శ్రీనివాస్‌ను సాంప్రదాయ పద్ధతిలో ఉత్సవ కమిటీ మంగళవారం ఆహ్వానించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని, ఉత్సవాలలో లోటుపాట్లు లేకుండా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఉత్సవాలకు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుండి కూడా పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం అధ్యక్షులు తూటారపు ఏడుకొండలు, వైస్ ప్రెసిడెంట్ కొప్పుల సత్యనారాయణ, రామాయణం గోవిందు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పోడూరు

యుటిఎఫ్ మండల సమావేశం సోమవారం రాత్రి జిన్నూరు గ్రామంలో జరిగింది. ఈ సమావేశానికి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి రామభద్రం, జిల్లా కార్యదర్శులు పి.క్రాంతికుమార్, సిహెచ్ పట్టాభి రామయ్య, జి.లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా దాసరి క్షేమమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కేతా.నాగరాజు, గౌరవాధ్యక్షులుగా టి.వెంకటేశ్వరరావు, సహా అధ్యక్షులుగా సిహెచ్.త్రినాథ్, మహిళా సహా అధ్యక్షులుగా కె.శిరీష కోసాధికారిగా కె.దుర్గాప్రసాద్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No. : 4/2021 in OS No. 73/2014

పిటీషనరు/ DHR's:
1) Rapaka Prasada Rao (Died), 2) Rapaka Ratna Kumari, 3) Rapaka Narasimha Raju, 4) Vipparthi Surya Kumari, (2 to 4 Plaintiffs were added as legal representatives of the 1st Plaintiff as per the order in IA No.648/2015 dated 09.08.2016)
రెస్పాండెంటు/ JDR : **Chatragadda Sri Ramulu**

పై నెంబరు పిటీషనులో చాట్రగడ్డ శ్రీరాములు, తండ్రి : కృష్టాఫర్, నివాసం : 180-2/1, జంగారెడ్డి గూడెం అను వారికి నోటీసులు కోర్టు ద్వారాన్నూ, రిజిష్టరు పోస్టు ద్వారాన్నూ అమలు జరగనందున Substitute Service ద్వారా అమలు జరుపుటకు గాను ది.03.02.203 తేదీన వాయిదా వేసినారు. కావున JDR/ Respondent సదరు వాయిదా రోజు ఉదయం గం.10:30 ని॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల JDR/ Respondent పరోక్షమందు పై పిటీషన్ తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

స్థలం : తాడేపల్లిగూడెం తేది : 10-01-2023

ఇట్లు : **యమ్.వి.ఆర్. కృష్ణ మోహన్**
పిటీషనర్/ డిహెచ్ఆర్‌ల తరపున అడ్వకేట్
తాడేపల్లి గూడెం.

పాస్‌పోర్టు పోయింది

ఏలూరి శ్రీనివాస రావు, తండ్రి: నాగేశ్వరరావు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. సిద్ధాంతం గ్రామం నుండి పెనుగొండ జిరాక్స్ సెంటర్‌కి వస్తుండగా మార్గమధ్యంలో పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ **G2920256** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకి తెలియజేయగలరు.

ఏలూరి శ్రీనివాసరావు
తండ్రి: నాగేశ్వరరావు, సిద్ధాంతం,
పెనుగొండ మండలం, ప॥గో॥జిల్లా.
సెల్ : 63017 98056

పత్రికా ప్రకటన

నా క్లయింటున్నూ, ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, నూజివీడు పట్టణ కాపురస్థులు **మొహమ్మద్ అజ్మతుల్లా గారి భార్య మేరుగు లక్ష్మి అనే "మొహమ్మద్ సన"** గారు నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా..,

నా క్లయింటు హిందు మతమునకు చెందినవారై "మేరుగు లక్ష్మి" అనే పేరుతో వ్యవహరించబడే వారు. దర్మిలా నా క్లయింటు నూజివీడు పట్టణ కాపురస్తులు **"మొహ్మమ్మద్ అజ్మతుల్లా, తండ్రి: అబ్దుల్ సలాం" అను వారిని ది.01-12-2013వ తేదీన ముస్లిం సంప్రదాయం ప్రకారం మతాంతర వివాహం చేసుకుని తన పేరున "మేరుగు లక్ష్మి" నుండి "మొహమ్మద్ సన" గా మార్చుకొని, అప్పటి నుండి "మొహమ్మద్ సన" పేరుతో వ్యవహరించ బడుచున్నారు.** కావున నా క్లయింటు తన పేరును "మేరుగు లక్ష్మి"కు బదులుగా "మొహమ్మద్ సన" అను పేరుతో వ్యవహరించ బడునని, ఇందు విషయమై ఎవరికైననూ ఏ విధమైన అభ్యంతరములు కానీ, ఆక్షేపణలు ఉన్ననూ ఈ ప్రకటన జారీ కాబడిన 15 రోజులలో ఈ దిగువ తెలియజేసిన చిరునామా నందు తెలియ జేసుకొనవలసిందిగా కోరడమైనది.

సయ్యద్ ఫరూఖ్
న్యాయవాది, నూజివీడు. సెల్: 99494 48597

మహారాజశ్రీ పాలకొల్లు అదనపు జూనియర్ సివిల్ జడ్జి-మరియు-జ్యుడిసియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ మొదటి తరగతి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 03/2022

బిట్వీన్:
యిళ్ళ నాగేశ్వరరావు ...వాది
VS
పెచెట్టి నరసమ్మ వగైరా ...ప్రతివాదులు
టు:
పెచెట్టి నరశింహారావు, డి-9, తండ్రి: శీతారామయ్య, ప్రస్తుత నివాసం తూర్పుపాలెం (మంగలిపాలెం), పోడూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో 9వ ప్రతివాది మీకు శ్రీ కోర్టు వారు దావా సామాన్లు అనేక పర్యాయములు పంపించినప్పటికీ మీరు తీసుకోనని కారణముగా శ్రీ కోర్టు వారి ఆదేశము ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా.., పై నెంబరు దావా మీయొక్క హాజరు నిమిత్తం **ది.20-01-2023వ తేదీకు శ్రీ కోర్టు వారు వాయిదా వేసియున్నారు.** కావున సదరు వాయిదా తేదీన శ్రీ కోర్టు వారు ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరై మీ అభ్యంతరములు తెలియజేసుకొనగలరు. లేని ఎడల మీ పరోక్షమున తదుపరి గ్రంధము జరుపబడును.

(శ్రీ కోర్టు వారు అనుమతితో)

ఐ.శివసాంభమూర్తి
కె.రాంబాబు,
పాలకొల్లు, అడ్వకేట్స్, పాలకొల్లు.
02-01-23.